క్లుప్తంగా

ఏయూ ప్రతిష్టను పెంచండి


క్రీడాకారులతో వీసీ శశిభూషణరావు తదితరులు

విశాఖ విద్య: క్రీడల్లో ప్రతిభ చూపుతూ విద్యార్థులు ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రతిష్టను పెంచాలని వీసీ ఆచార్య జి.శశిభూషణరావు ఆకాంక్షించారు. ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ క్రాస్ కంట్రీ చాపియన్‌షిప్ పోటీలకు వెళ్తున్న విద్యార్థులను శనివారం ఆయన తన చాంబర్‌లో అభినందించారు. క్రాస్ కంట్రీ మెన్, వుమెన్ క్రీడా బృందాలు బెంగళూరుకు వెళ్లనున్నాయి. ఈ సందర్భంగా వీరిని ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో క్రీడా విభాగాధిపతి ఆచార్య ఎ.పల్లవి, క్రీడా విభాగ సంచాలకుడు ఆచార్య ఎన్.విజయమోహన్, మీడియా రిలేషన్స్ డీన్ ఆచార్య చల్లా రామకృష్ణ, ద్రోణాచార్య అవార్డు గ్రహీత, బాక్సింగ్ కోచ్ ఐ.వెంకటేశ్వరరావు, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెలమలను బీసీ-ఏలో చేర్చాలని వినతి

ఏయూక్యాంపస్: వెలమలను బీసీ–డీ జాబితా నుంచి బీసీ–ఏలోకి మార్చాలని కోరుతూ రాష్ట్ర మంత్రులకు ఏపీ వెలమ సంక్షేమ సంఘం అధ్యక్షుడు లగుడు గోవిందరావు వినతిపత్రం అందజేశారు. అమరావతిలో రాష్ట్ర మంత్రులు కె.అచ్చంనాయుడు, కొండపల్లి శ్రీనివాసరావులను కలిసి వెలమ సామాజిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. విశాఖలో వెలమ సామాజిక భవనానికి స్థలం కేటాయించాలని, తాటిపూడి జలాశయానికి గొర్రుపాటి బుచ్చి అప్పారావు పేరునే కొనసాగించాలని కోరారు. రాష్ట్రంలో బీసీ కులగణన చేయాలని, విదేశాల్లో చదువుకోవడానికి వెళ్లే వారికి ఆర్థిక సాయం, నిధులు మంజూరు చేయాలని వినతిపత్రం అందించారు. వీటిని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామని మంత్రులు తెలిపారని గోవిందరావు చెప్పారు.

19 నుంచి బాలల హక్కులపై అవగాహన శిబిరాలు


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రకాశరావు తదితరులు


ఎంవీపీకాలనీ: స్థానిక వీఎంసీ డిగ్రీ కళాశాల ఆవరణలో శనివారం బాలల హక్కుల పరిరక్షణపై అవగాహన శిబిరాల పోస్టర్‌ను బాల వికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ కార్యదర్శి నరవ ప్రకాశరావు మాట్లాడుతూ బాలల పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 19 నుంచి 21 వరకు వివిధ వేదికలపై శిబిరాలు జరుగుతాయని తెలిపారు. బాలల హక్కులు, వాటి పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలను వివరిస్తామన్నారు. 19న బీవీఎఫ్ స్కూల్, 20న ఏయూ సోషల్ వర్క్ విభాగం, 21న అక్కయ్యపాలెం వాగ్దేవి స్కూల్ లో శిబిరాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో వీఎంసీ కళాశాల ప్రిన్సిపాల్ జగదీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా జర్నలిజం పరీక్షలు


పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ నరసింహారావు

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయం జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్ విభాగం మూడో సెమిస్టర్ పరీక్షలు శనివారం నుంచి ప్రారంభమయ్యాయి. వర్సిటీ ఆర్ట్స్ అండ్ కామర్స్ కాలేజీలో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎ.నరసింహరావు పర్యవేక్షించారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా తగిన ఏర్పాట్లు చేయాలని ఆచార్యులకు సూచించారు. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా చూడాలన్నారు.

బయోడైవర్సిటీ పార్క్ సందర్శన


పార్క్‌లో విద్యార్థుల సందడి

బీచ్‌రోడ్డు: చింతపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు శనివారం పెదవాల్తేరులోని బయోడైవర్సిటీ పార్క్‌ను సందర్శించారు. వారికి పార్క్ పర్యవేక్షకుడు రామమూర్తి వివిధ రకాల మొక్కల విశేషాలను వివరించారు. కాలేజీ ప్రిన్సిపాల్ విజయభారతి, వి.రమణ, ఉమ పాల్గొన్నారు.

మోక్షమెప్పుడో..?

- నేటికీ ప్రారంభం కాని ఆరిలోవ నూతన పోలీస్ స్టేషన్
- పాత పీఎస్‌లోనే ఇబ్బంది పడుతూ సిబ్బంది విధుల నిర్వహణ
- నిత్యం ఫిర్యాదుదారులతో కిక్కిరిసిపోతున్న స్టేషన్ ఆవరణ
- మీనమేషాలు లెక్కిస్తున్న పోలీస్ అధికారులు


విమ్స్ ఆవరణలో నిర్మించిన ఆరిలోవ పోలీస్ స్టేషన్ నూతన భవనం


ఆరిలోవ పీఎస్ వద్ద సీజ్ చేసిన వాహనాలతో నిండిన ప్రజా వినియోగ స్థలం

ఆరిలోవ: ఆరిలోవ పోలీస్ స్టేషన్‌కు మోక్షం ఎప్పుడు కలుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. సుమారు ఎకరం స్థలంలో విశాలమైన భవన నిర్మాణం పూర్తయినప్పటికీ ఉపయోగించకుండా వదిలేశారు. దశాబ్దాలుగా ఇరుకు గదిలోనే పోలీస్ స్టేషన్ నిర్వహిస్తూ కాలం గడిపేస్తున్నారు. అటు విధులు నిర్వహించడానికి పోలీస్ సిబ్బంది.. ఇటు ఫిర్యాదుదారులు, అవసరాలపై వెళ్లే వారు ఇబ్బందులు పడుతున్నారు. రూ.కోట్లు ఖర్చు చేసి నిర్మించిన భవనం కళ్లెదుటే ఉన్నా.. వినియోగంలోకి తెచ్చేందుకు పోలీస్ ఉన్నతాధికారులు వెనుకాడుతున్నారు.

ఆధునిక సౌకర్యాలతో భవన నిర్మాణం

విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(విమ్స్) ఆవరణలోని సుమారు ఎకరం స్థలంలో 500 చదరపు గజాల్లో ఆరిలోవ పోలీస్ స్టేషన్ నూతన భవనం నిర్మించారు. రూ.6 కోట్లతో ఆధునిక సౌకర్యాలు కల్పించారు. హౌస్ ఆఫీసర్(సీఐ), సబ్ ఇన్‌స్పెక్టర్లు, ఏఎస్‌ఐలకు ప్రత్యేకంగా చాంబర్లు, రైటర్ రూమ్, రికార్డులు భద్రపరిచే గదులు, ఆఫీస్ రూమ్, సిబ్బందికి, ప్రజలకు అవసరమైన వాష్‌రూమ్‌లు, పురుషులు, మహిళా నిందితులకు వేర్వేరుగా కంట్రోల్ రూమ్‌లు(లాకప్‌లు), విశ్రాంతి గదులు, రిసెప్షన్ హాల్ తదితర విభాగాలకు ప్రత్యేకంగా గదులు సిద్ధం చేశారు. సెల్లార్‌తోపాటు మొదటి అంతస్తులో సౌకర్యాలు ఏర్పాటు చేశారు. మిగిలిన ఖాళీ స్థలాన్ని పార్కింగ్‌తోపాటు దొంగతనాలు, రోడ్డు ప్రమాదానికి గురైన వాహనాలు భద్రపరచడానికి వినియోగిస్తారు.

ఇరుకు గదిలోనే స్టేషన్..

ఆరిలోవలో కొన్ని దశాబ్దాలుగా ఇరుకు గదిలోనే పోలీస్ స్టేషన్ నిర్వహిస్తున్నారు. సుమారు 100 చదరపు గజాల విస్తీర్ణంలో ఉన్న హాల్‌ను చిన్నచిన్న భాగాలుగా చేసి సీఐ చాంబర్, ఎస్‌ఐలు, రైటర్ టేబుళ్లు, కంట్రోల్ రూమ్, రిసెప్షన్ తదితర వాటిని ఏర్పాటు చేశారు. ఇక్కడ సిబ్బంది 50 మంది వరకు ఉన్నారు. సిబ్బందికి, పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన ప్రజలకు మరుగుదొడ్ల సదుపాయం కూడా లేదు. ఫిర్యాదుదారులు, అవసరాల కోసం వెళ్లే వారితో నిత్యం ఈ స్టేషన్ రద్దీగా ఉంటుంది. లోపల స్థలం లేకపోవడంతో స్టేషన్ ముందున్న రోడ్డుపైనే గుంపులుగా చేరాల్సిన పరిస్థితి. ఇది ఆరిలోవ ప్రధాన రహదారి కావడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి.


ఆరిలోవలో ఫిర్యాదుదారులతో కిటకిటలాడుతున్న ఇరుకు స్టేషన్

భారీగా పేరుకుపోయిన సీజ్డ్ వాహనాలు

పోలీసులు పట్టుకున్న దొంగ వాహనాలు, రోడ్డు ప్రమాదాలకు గురైన వాహనాలు, వివాదాస్పదమైన వాహనాలు ఈ స్టేషన్ వద్ద ఉంచడానికి ప్రత్యేకంగా స్థలం లేదు. స్టేషన్ చుట్టూ ఖాళీగా ఉన స్థలాల్లో వీటిని ఏళ్ల తరబడి నిలిపేస్తున్నారు. స్టేషన్ పక్కనే ఉన్న రెండు సచివాలయాలకు వెళ్లే దారి సైతం ఈ వాహనాలతో నిండిపోయింది. వీటి వల్ల స్థానికులు సచివాలయాలకు వెళ్లే మార్గం లేకుండా పోయింది. కొత్త పోలీస్ స్టేషన్‌ను వెంటనే ప్రారంభించి వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

ఇందుకేనా జాప్యం..!

స్టేషన్ భవన నిర్మాణమంతా పూర్తయినప్పటికీ రాష్ట్ర హోం శాఖ మంత్రి అనితతో ప్రారంభించాలని పోలీస్ ఉన్నతాధికారులు భావిస్తున్నట్లు తెలిసింది. ఆమె అందుబాటులో లేకపోవడం, ఉన్న సమయంలో అపాయింట్‌మెంట్ లభించకపోవడంతో భవనాన్ని ప్రారంభించడంలో జాప్యం చేస్తున్నారని సమాచారం. హోం మంత్రి అందుబాటులోకి వస్తేగాని.. ఇక్కడ ఇరుకు పోలీస్ స్టేషన్‌కు మోక్షం కలిగినట్లు లేదని స్థానికులు అంటున్నారు.

కిడ్నీ వ్యాధులపై అవగాహన అవసరం


బైక్ ర్యాలీ ప్రారంభిస్తున్న డీసీపీ అజిత

ఆరిలోవ: కిడ్నీ వ్యాధులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని లా అండ్ ఆర్డర్ డీసీపీ డాక్టర్ అజిత సూచించారు. ఆరిలోవ హెల్త్ సిటీలో మెడికవర్ ఆస్పత్రి, క్రజ్‌బ్రిడ్జి, లైఫ్ ఇన్‌ఫ్రా బృందం ఆధ్వర్యంలో శనివారం కిడ్నీ వ్యాధులపై అవగాహన కోసం చేపట్టిన ఆల్ ఇండియా బైక్ ర్యాలీని ఆమె ప్రారంభించి మాట్లాడారు. మెడికవర్ ఆస్పత్రి వైద్యులు, లైఫ్ ఇన్‌ఫ్రా ప్రతినిధులు కిడ్నీ వ్యాధుల నివారణకు రోబోటిక్ సర్జరీలు, వాటి పురోగతిపై ప్రజలకు అవగాహన కల్పించడం మంచి పరిణామమన్నారు. మెడికవర్ ఆస్పత్రి వైద్యులు, లైఫ్ ఇన్‌ఫ్రా ప్రతినిధులు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా రోబోటిక్ సర్జరీలపై అవగాహన కల్పించడానికి ఈ ర్యాలీ చేసినట్లు తెలిపారు. 15 మంది బైకర్లు 1,400 కిలోమీటర్లు ర్యాలీ చేపట్టారన్నారు. హైదరాబాద్‌లో ప్రారంభమైన ఈ బైక్ ర్యాలీ శుక్రవారం సాయంత్రం విశాఖ చేరుకుందన్నారు. తిరిగి శనివారం విశాఖ నుంచి హైదరాబాద్ బయలుదేరినట్లు తెలిపారు. కార్యక్రమంలో మెడికవర్ కిడ్నీ నెఫ్రాలజిస్ట్ డాక్టర్ కమల్‌కిరణ్, చీఫ్ బిజినెస్ ఆఫీసర్ మహేష్ కిరణ్, లైఫ్ ఇన్‌ఫ్రా డైరెక్టర్ భరత్, క్రజ్‌బ్రిడ్జి, లైఫ్ ఇన్‌ఫ్రా ప్రతినిధులు పాల్గొన్నారు.

కనుల పండువగా పడిపూజ


విశేష అలంకరణలో అయ్యప్ప స్వామి

మద్దిలపాలెం: కొత్త వెంకోజీపాలెం గౌరీ జ్ఞానలింగేశ్వరాలయంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో శనివారం పడిపూజ మహోత్సవం కనుల పండువగా జరిగింది. గ్రామ సేవా సంఘం ఆధ్వర్యంలో ఉదయం 5 గంటలకు లక్ష్మీగణపతి హోమం, 6 గంటల నుంచి అయ్యప్ప స్వామికి విశేష అభిషేకాలు చేశారు. ప్రత్యేక అలంకరణలో స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధానార్చకులు ఆరవెల్లి సూర్యప్రకాష్‌శర్మ, సుబ్రహ్మణ్యశాస్త్రి, బాల భాస్కరశర్మ పడిపూజ అభిషేకం చేశారు.


పడిపూజ ఉత్సవంలో పాల్గొన్న స్వాములు

శబరిమలలో మండలపూజ మహోత్సవాల ప్రారంభంలో భాగంగా ఇక్కడ వచ్చే నెల 26 వరకు మండలం పూజలు జరుగుతాయని సంఘ అధ్యక్షుడు పీల కనకరాజు తెలిపారు. అయ్యప్పస్వామిని పల్లకీలో పురవీధుల్లో ఊరేగించారు. పి.చక్రవర్తి గురుస్వామి తత్వమసి అయ్యప్ప భక్త బృందంచే ఏర్పాటు చేసిన భజన కార్యక్రమం ఆహుతులను విశేషంగా ఆకట్టుకుంది. అధిక సంఖ్యలో మాలధారులు, భక్తులు పాల్గొన్నారు.

ఇన్నోవేషన్ ద్వారా విద్యకు సాధికారత

మద్దిలపాలెం: ఇన్నోవేషన్ ద్వారానే విద్యకు సాధికారత వస్తుందని స్కూల్ ఆఫ్ వండర్ కిడ్స్ ప్రిన్సిపాల్ మళ్ల వాణిశ్రీ పేర్కొన్నారు. మద్దిలపాలెంలోని ఓ హోటల్లో శనివారం జరిగిన ఫ్యూచర్ ఫార్వర్డ్ ఎడ్యుకేషన్ వర్క్‌షాప్ అండ్ న్యూ నార్మల్ ఎడ్యుకేషన్ లీడర్‌షిప్ సమ్మిట్ అవార్డుల కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఏఐ, ఎడ్ టెక్ తదితర ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగిస్తే విద్యార్థుల లెర్నింగ్ సులువవుతుందన్నారు. పర్సనలైజ్డ్ లెర్నింగ్ అనే అంశంపై జరిగిన చర్చా కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు, విద్యారంగ నిపుణులతో వాణిశ్రీ చర్చించారు. ఎడ్యుకేషనల్ ఎక్సలెన్స్‌లో స్కూల్ ఆఫ్ వండర్ కిడ్స్ అగ్రగామిగా ఉండాలనే దృఢ నిశ్చయంతో పనిచేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో పలువురు విద్యారంగ నిపుణులు పాల్గొన్నారు.

ముత్తుస్వామి దీక్షితార్‌కు స్వర నివాళి


గాత్ర కచేరీ చేస్తున్న రాజారావు

మద్దిలపాలెం: స్థానిక కళాభారతి ఆడిటోరియంలో శనివారం ముత్తుస్వామి దీక్షితార్ వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించామని కళాభారతి ట్రస్ట్ కార్యదర్శి డాక్టర్ గుమ్మలూరి రాంబాబు తెలిపారు. త్యాగరాజ ఆరాధన ట్రస్ట్ స్థాపించి 30 ఏళ్లు అయిందని, సంస్థ వాగ్గేయకారుల జయంతి, వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. దీనిలో భాగంగా సంగీత త్రిమూర్తుల్లో ఒకరైన ముత్తుస్వామి దీక్షితార్ వర్ధంతిని నిర్వహించామన్నారు. కార్యక్రమాన్ని అధ్యక్షులు మంతెన సత్యనారాయణ రాజు, డాక్టర్ రాంబాబు, ఆకొండి శ్రీనివాస రాజారావు, చంద్రశేఖర్, భుజంగరావు జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఆకొండి శ్రీనివాస రాజారావు అద్భుతమైన గాత్ర సౌరభంతో అనేక కృతులను గానం చేసి శ్రోతలను మెప్పించారు. వయోలిన్‌పై ఈటి లక్ష్మీగణపతి శర్మ, మృదంగంపై సుబ్రహ్మణ్యం సహకరించారు.

పీజీ, యూజీ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

బీచ్‌రోడ్డు: రెండేళ్ల పోస్ట్ గ్రాడ్యుయేషన్, నాలుగేళ్ల అండర్ గ్రాడ్యుయేషన్ ప్రోగ్రామ్స్‌కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అజీమ్ ప్రేమ్ జీ యూనివర్సిటీ ఒక ప్రకటనలో తెలిపింది. ఎంఏ ఎడ్యుకేషన్, ఎంఏ డెవలప్‌మెంట్, మాస్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్, ఎంఏ ఎకనామిక్స్, బీఏ ఆనర్స్, బీఎస్సీ ఆనర్స్ కోర్సులు అందుబాటులో ఉన్నట్లు పేర్కొంది. ఆసక్తి గల విద్యార్థులు తమ యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరింది.

సరికొత్త ఆవిష్కరణలే లక్ష్యం

ఎంవీపీకాలనీ: ఆవిష్కరణలే లక్ష్యంగా పరిశోధన విజ్ఞానం అభివృద్ధిపై ఎంవీపీ కాలనీ గాయత్రి విద్యా పరిషత్ డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. కళాశాలలో శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో ఏయూ బయోటెక్నాలజీ ఆచార్యుడు, ప్రిన్సిపల్ సైంటిస్ట్ టీక్యాబ్–ఈ డాక్టర్ రవికిరణ్ ముఖ్య అతిథిగా మాట్లాడారు. పరిశోధనాంశాల్లో మెలకువలు, కొత్త ఆవిష్కరణలు ఎలాంటి అంశాలపై ఎంచుకోవాలి, పేటెంట్ ఫైలింగ్, కెరీర్ కౌన్సెలింగ్ విషయాల గురించి విద్యార్థులకు తెలియజేశారు.

మొక్కలు నాటిన కలెక్టర్


బయోడైవర్సిటీ పార్క్‌లో మొక్క నాటుతున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

బీచ్‌రోడ్డు: పెదవాల్తేరులోని బయో డైవర్సిటీ పార్క్‌లో శనివారం కలెక్టర్ ఎంఎన్ హరేందిర ప్రసాద్ మొక్కలు నాటారు. అనంతరం పార్క్‌లోని మొక్కల గురించి పర్యవేక్షకుడు రామమూర్తిని అడిగి ఆయన తెలుసుకున్నారు. అరుదైన మొక్కల గుణాలు, విశేషాలపై కలెక్టర్ ఆరా తీశారు. ఆయన వెంట పలువురు అధికారులు ఉన్నారు.

ఘనంగా అయ్యప్ప పల్లకీ సేవ


అయ్యప్ప పల్లకీ సేవలో కోలాటమాడుతున్న మహిళలు, చిన్నారులు

ఆరిలోవ: జీవీఎంసీ 10వ వార్డు ఇందిరానగర్‌లో అయ్యప్ప స్వామి పల్లకీ సేవ కార్యక్రమం శనివారం సాయంత్రం ఘనంగా జరిగింది. మణికంఠ మిత్ర బృందం ఆధ్వర్యంలో ఇక్కడ అయ్యప్ప స్వామి పీఠం ఏర్పాటు చేసి నిత్యం భక్తితో పూజలు చేస్తున్నారు. అయ్యప్ప స్వామి పల్లకి ముందు నిర్వహించిన మహిళల కోలాటం, భజనలు, భక్తి కీర్తనలు ఎంతో ఉత్సాహంగా సాగాయి. ఈ ప్రాంతంలో ఆధ్యాత్మిక శోభ నెలకొంది.

బీచ్ రోడ్డులో బైకర్ల సందడి


బీచ్ రోడ్డులో బైకులపై వెళ్తున్న రైడర్లు

ఏయూక్యాంపస్: విశాఖ బీచ్ రోడ్డులో శనివారం ఉదయం పదుల సంఖ్యలో భారీ బైక్‌లు ర్యాలీగా ఒక దాని వెనుక వెళుతూ సందడి చేశాయి. వీటిని పర్యాటకులు, స్థానికులు ఆసక్తిగా తిలకించారు. బీఎండబ్ల్యూ, హార్లీ డేవిడ్సన్, ట్రయంఫ్ తదితర బహుళజాతి సంస్థలకు చెందిన ఖరీదైన బైక్‌లపై రైడర్లు బీచ్ రోడ్డులో రయ్ రయ్‌మంటూ వెళ్లారు. వైఎంసీఏ నుంచి ఆర్కే బీచ్ వరకు వీరు ప్రయాణించారు.

సేవాపథంలో రౌండ్ టేబుల్ ఇండియా


వివరాలు వెల్లడిస్తున్న చైర్మన్ చైతన్య

ఏయూక్యాంపస్: రౌండ్ టేబుల్ ఇండియా వారోత్సవాల్లో భాగంగా నగరంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించామని వాల్తేరు రౌండ్ టేబుల్ 92 చైర్మన్ చిన్నం చైతన్య తెలిపారు. బీచ్ రోడ్డులోని ఒక హోటల్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. విద్యతో స్వేచ్ఛ అనే నినాదంతో రౌండ్ టేబుల్ ఇండియా నగరంతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో సైతం పాఠశాలలు, తరగతి గదులను నిర్మించి ఇస్తోందన్నారు. 18 నుంచి 40 ఏళ్ల యువకులు దీనిలో సభ్యులుగా ఉంటూ సేవా కార్యక్రమాలు చేస్తున్నారన్నారు. ఈ నెల 11న రెల్లివీధి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అల్పాహారం, 12న 120 మంది విద్యార్థులకు కళ్లద్దాలు, 13న విశాలాక్షినగర్‌లో 8 తరగతి గదుల నిర్మాణానికి శంకుస్థాపన చేశామన్నారు. 14న లెబెన్ షెల్ఫే పాఠశాలలో ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులకు చిత్రలేఖనం, నృత్యం పోటీలు నిర్వహించి, వీరికి బహుమతులు, రుచికరమైన ఆహారం అందించామని చెప్పారు. గీతం మెడికల్ కళాశాల సౌజన్యంతో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసి 140 యూనిట్లు రక్తం దానం చేశామన్నారు. కార్యక్రమంలో వాల్తేరు రౌండ్ టేబుల్ 92 వైస్ చైర్మన్ డి.ఎస్‌రాజు, ఏరియా సెక్రటరీ కె.మోహిత్, వైజాగ్ వైకింగ్స్ రౌండ్ టేబుల్ 213 చైర్మన్ రవి సింఘాల్, కార్యదర్శి బి.శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఏయూలో 'స్వచ్ఛతా హీ సేవా'


ఏయూ ప్రాంగణాన్ని శుభ్రం చేసిన విద్యార్థులు

విశాఖ విద్య: ఆంధ్రా యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కామర్స్ ఎన్ఎస్ఎస్ యూనిట్–2 ఆధ్వర్యంలో శనివారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. వర్సిటీ కేంద్రీయ గ్రంథాలయం, కన్వొకేషన్ హాల్ దగ్గర, లైబ్రరీ వెనుక భాగంలో ఉన్న చెట్ల పొదలు, పిచ్చి మొక్కలను తొలగించారు. ఏయూ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ బోరుగడ్డ సుబ్బయ్య, డిపార్ట్‌మెంట్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్, ఎంఏ సోషియాలజీ, ఎంఏ హిందీ, ఎంఏ సోషల్ వర్క్ విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొని వర్సిటీ ప్రాంగణాన్ని శుభ్రం చేశారు. డాక్టర్ సుబ్బయ్య మాట్లాడుతూ యూనివర్సిటీలో ఎకో ఫ్రెండ్లీ, సోషల్ ఫ్రెండ్లీ వాతావరణం ఎప్పుడూ ఉంటుందన్నారు. లైబ్రరీ పరిసర ప్రాంతాల్లో కాంపిటేటివ్ పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులకు, సందర్శకులకు ఏయూ పచ్చతోరణంలా కళకళలాడుతూ ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉండేలా జాతీయ సేవా పథకం పనిచేస్తోందన్నారు. కార్యక్రమంలో విద్యార్థి వలంటీర్స్ కుమారస్వామి, తేజస్విని, సాయి, పార్వతి, లావణ్య, కల్యాణ్ వనం, మహాలక్ష్మి, యాదగిరి, సౌరభ్ తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాల పెంపుతో ఉపాధి అవకాశాలు


ప్రాంతీయ ఉపాధి అధికారి అనిల్‌కుమార్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు

విశాఖ విద్య: విద్యార్థులు నైపుణ్యాలను మెరుగుపరుచుకుంటే ఉపాధి అవకాశాలు విస్తృతంగా ఉంటాయని ప్రభుత్వ ప్రాంతీయ ఉపాధి అధికారి టి.అనిల్‌కుమార్ అన్నారు. కెరీర్ కౌన్సెలింగ్, స్కిల్ డెవలప్‌మెంట్, ఇంటర్ ప్రెన్యూర్‌షిప్‌లో అవకాశాలు అనే అంశంపై ఏయూ రాజనీతి, ప్రభుత్వ పాలన శాస్త్రం విభాగాధిపతి ఆచార్య ప్రేమానందం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన సదస్సులో ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడారు. రాజనీతి, ప్రభుత్వ పాలనా శాస్త్రం చదువుతున్న విద్యార్థులు యూఎన్‌వో నుంచి నాన్ ప్రాఫిట్ ఆర్గనైజేషన్ వరకు ఎటువంటి ఉద్యోగ అవకాశాలను పొందవచ్చు వివరించారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ప్రాజెక్టులను ఏ విధంగా వినియోగించుకోవాలి, ఉపాధి అవకాశాలు మెరుగుపరుచుకోవడం కోసం విద్యార్థులు కాలానుగుణంగా నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు. ప్రేమానందం మాట్లాడుతూ విద్యార్థులు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు అందిపుచ్చుకునేందుకు భవిష్యత్ ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సత్యనారాయణ, డాక్టర్ హరిబాబు, డాక్టర్ నాగరాజు, డాక్టర్ రత్నరాజు, డాక్టర్ ప్రసాద్, డాక్టర్ వెంకటరమణ, డాక్టర్ దంతేశ్వర్, పరిశోధకులు విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు


వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ఎంవీపీకాలనీ: జాతీ య గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఎంవీపీ కాలనీ శాఖ గ్రంథాలయంలో శనివారం 'సెల్‌ఫోన్ వినియోగం–విద్యార్థులపై ప్రభావం' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. జేకే స్కూల్, శాంతినికేతన్ స్కూల్‌కు చెందిన 6 నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ఈ నెల 17న గ్రంథాలయ ఉద్యమకారులను స్మరించుకోవడం, 18న చిత్రలేఖన పోటీలు, 19న ముగ్గుల పోటీలు, 20న ముగింపు సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జేకే స్కూల్ తెలుగు ఉపాధ్యాయుడు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

ఆరిలోవ: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జీవీఎంసీ మలేరియా విభాగం ఆధ్వర్యంలో వ్యాకరాజు కళా బృందం సభ్యులు శనివారం ఆరిలోవలో అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. నెహ్రూనగర్, రవీంద్రనగర్ బస్ స్టాప్‌ల వద్ద పాటలు పాడుతూ మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా తదితర వ్యాధుల గురించి వివరించారు. వాటిన్నింటికి కారణమైన దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పాటల రూపంలో తెలియజేస్తూ స్థానికులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యాకరాజు కళా బృందం సభ్యులు, మలేరియా విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన గౌరీపరమేశ్వరుల ఉత్సవాలు


గౌరీపరమేశ్వరులను ఊరేగిస్తున్న భక్తులు

మద్దిలపాలెం: పాతవెంకోజీపాలెంలో సీతారామ సేవా సంఘం ఆధ్వర్యంలో తొమ్మిది రోజులుగా జరుగుతున్న గౌరీపరమేశ్వరుల ఉత్సవాలు శనివారంతో ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా గ్రామస్తులందరూ ప్రత్యేక అభిషేకాలు చేశారు. మధ్యాహ్నం మహాఅన్నదానం జరిగింది. సారె పూజలో భక్తులు తీసుకొచ్చిన మిఠాయిలను అన్నదానంలో వినియోగించారు. సుమారు వెయ్యి మంది పాల్గొని అమ్మవారి ప్రసాదం స్వీకరించారు. సాయంత్రం మేళతాళాల నడుమ వేద మంత్రాలతో అమ్మవారి ఊరేగింపు వైభవంగా సాగింది. సంఘ సభ్యులు, మహిళలు తలపై ఉత్సవ విగ్రహాలు మోస్తూ వీధుల్లో ఊరేగించారు. తీన్మార్, కోలాటం, సాముగరిడీలతో అమ్మవారిని ఊరేగించి సముద్రంలో నిమజ్జనం చేశారు. మాజీ డిప్యూటీ మేయర్ మళ్ల అప్పలరాజు, సంఘ అధ్యక్షుడు ఆదారి పరదేశినాయుడు, స్థానికులు పాల్గొన్నారు.

గౌరమ్మకు పసుపు, కుంకుమల సమర్పణ

గవర జాతీయులు ఇలవేల్పుగా భావించి ప్రతీ ఏటా నిర్వహించే గౌరీపరమేశ్వరి ఉత్సవాల్లో కేంద్ర గౌరీ సేవా సంఘం అన్ని సంఘాలకు వెళ్లికి పసుపు, కుంకుమలను సమర్పిస్తోంది. పాత వెంకోజీపాలెంలో శ్రీ సీతారామ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో శనివారం కేంద్ర గౌరీ సేవా సంఘ అధ్యక్షుడు బుద్ధ శివాజీ ఆధ్వర్యంలో సభ్యులు మళ్ల రవికుమార్ తదితరులు గౌరీపరమేశ్వరులకు పసుపు, కుంకుమలను అందజేశారు. సీతారామ సేవా సంఘం వారు కేంద్ర సంఘం వారిని శాలువాలతో సత్కరించారు. మాజీ డిప్యూటీ మేయర్ మళ్ల అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.